## క్లుప్తంగా

### నేడు నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన

దౌల్తాబాద్: మండలంలోని బిచ్చాల గ్రామంలో శుక్రవారం వీరాంజనేయ స్వామి ఆలయంలో నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 6గంటలకు కలశపూజ, హోమం, నవగ్రహాలు, నాగుల ప్రతిష్ఠాపన చేస్తామని చెప్పారు. అనంతరం నవగ్రహాల ఊరేగింపు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

### అదను చూసి.. ఆర్టీసీ బాదుడు

12 కి.మీ. దూరానికి రూ.50 వసూలు




ప్రయాణికులకు విక్రయించిన చించోలి టు తాండూర్ టికెట్

యాలాల: శ్రీరామనవమి ఉత్సవాలకు వచ్చే భక్తుల నుంచి ఆర్టీసీ అధికారులు అధిక చార్జీలు వసూలు చేయడం అన్యాయమని సీపీఎం మండల కార్యదర్శి బుగ్గప్ప అన్నారు. జాతరకు తాండూరు నుంచి జుంటుపల్లి వరకు తాండూరు డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారని, 12 కిలోమీటర్ల దూరం గల వేడుక ప్రాంతానికి రూ.20కి బదులు రూ.50 వసూలు చేయడమేంటని ప్రశ్నించారు. అంతే కాకుండా.. కర్ణాటక రాష్ట్రం చించోలి పేరుతో ముద్రించిన టికెట్లను ఈ 12 కి.మీ. దూరానికి విక్రయిస్తున్నారని మండిపడ్డారు. దైవ చింతన కోసం వచ్చే భక్తుల నుంచి రవాణా చార్జి పేరుతో అధిక మొత్తంలో వసూళ్లకు పాల్పడిన సంబంధిత ఆర్టీసీ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని బుగ్గప్ప డిమాండ్ చేశారు.

### సత్తాచాటిన విద్యార్థులు



ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

అనంతగిరి: ఇటీవల జరిగిన నేషనల్ ఇన్‌టీఎస్‌ఓ ఒలంపియాడ్‌లో వికారాబాద్ పట్టణానికి చెందిన శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో 2, 3, 5, 6 ర్యాంకులతో సత్తాచాటి.. మొత్తం 78 ఉత్తమ అవార్డులు సాధించారని ప్రిన్సిపాల్ రియాజ్ తెలిపారు. ఈ సందర్భంగా విజయం సాధించిన విద్యార్థులను బుధవారం ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో డీన్ రామకృష్ణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### నేడు సర్వసభ్య సమావేశం

కుల్కచర్ల: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహిస్తామని పీఏసీఎస్ సీఈఓ బక్కారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో సమీక్ష జరగనుందని, మండల పరిధి రైతులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

### ఆర్థిక సహాయం

కొడంగల్ రూరల్: గాంధీనగర్ కాలనీకి చెందిన సంపల్లి పద్మమ్మ(48) బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి.. వెంకటప్ప ద్వారా మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

# రమణీయం.. కమనీయం

- నేత్ర పర్వంగా నవమి వేడుకలు
- రాములోరి పెళ్లికి తరలివచ్చిన భక్తజనం

శ్రీరామ నవమి వేడుకలు గురువారం జిల్లాలో కనులవిందుగా జరిగాయి. పండుగ సందర్భంగా భక్తులు 'సీతారాముల కల్యాణం చూతము రారండి' అంటూ భక్తి శ్రద్ధలతో సకుటుంబ సమేతంగా ఆలయాలకు చేరుకోగా.. దేవాలయాలు, ప్రాంగణాలు కిటకిటలాడాయి. పరిసర ప్రాంతాలు శ్రీరామ నామస్మరణంతో మారుమోగాయి. వేలాదిగా తరలివచ్చిన భక్తజనం రాములవారి కల్యాణ ఘట్టాన్ని కనులారా వీక్షించారు. స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం శోభాయాత్ర, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఇదిలా ఉండగా.. రామాలయాలకు పోటెత్తిన భక్తజనానికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



తాండూరు టౌన్: సీతారాముల కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి తదితరులు



మోమిన్‌పేట: చీమల్‌దరిలో ఎమ్మెల్యే ఆనంద్



అనంతగిరి: తాళిబొట్టు చూపిస్తున్న అర్చకుడు



కొడంగల్‌లో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి



కొడంగల్ రూరల్: కల్యాణం జరిపిస్తున్న పురోహితులు



ధారూరులో దేవతామూర్తుల విగ్రహాల ఊరేగింపు



యాలాల: జుంటుపల్లి జాతరలో ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి



మోమిన్‌పేట: ఎన్కేపల్లిలో మాజీ మంత్రి చంద్రశేఖర్



తాండూరు టౌన్: వాయినం ఇచ్చి పుచ్చుకుంటున్న వైస్ చైర్‌పర్సన్ దీప, పలువురు మహిళలు



నవాబుపేట: గంగ్యాడలో ఎమ్మెల్యే కాలె యాదయ్య



బంట్వారంలో..



బొంరాస్‌పేటలో..



మర్పల్లిలో..



వికారాబాద్: రామమందిరం దోలారోహనంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల దంపతులు

## ఇంజక్షన్ వికటించి మహిళ మృతి

ధారూరు: కూరగాయలు కోస్తుండగా వేలికి గాయం కావడంతో ఓ మహిళ స్థానిక ఆర్‌ఎంపీ వైద్యుడిని ఆశ్రయించింది. సదరు డాక్టర్ ఇచ్చిన ఇంజక్షన్ వికటించడంతో మృతిచెందింది. ఈ సంఘటన ధారూరు మండల పరిధిలోని నాగారంలో గురువారం చోటుచేసుకుంది. కుటుంబీకులు, గ్రామస్తుల వివరాల ప్రకారం.. లక్ష్మీనగర్‌తండాకు చెందిన విస్లావత్ గమినిబాయి(45) కుమ్మర్‌పల్లితండాలో ఉంటున్న రెండో కూతురు కవితాబాయి ఇంటికి వెళ్లింది. అక్కడ కూరగాయలు కోస్తున్న క్రమంలో వేలికి గాయమైంది. వెంటనే కూతురు, తల్లి కలిసి నాగారంలో ఉన్న ఆర్‌ఎంపీ డాక్టర్ నగేష్ వద్దకు వెళ్లారు. పరీక్షించిన డాక్టర్ ఆమెకు ఇంజక్షన్ ఇవ్వగా.. వెంటనే నోట్లోంచి నురగలు రావడంతో ఆమెను చికిత్స నిమిత్తం వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతిరాలికి ఇద్దరు కొడుకులు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ఈ విషయమై గురువారం రాత్రి కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. కాగా గిరిజన మహిళ మృతిపై తమకు ఎలాటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ సంతోష్ తెలిపారు.



గమినిబాయి మృతదేహం

### చలివేంద్రం ఏర్పాటు హర్షణీయం

మోమిన్‌పేట: వేసవి కాలంలో చలి వేంద్రాల ద్వారా ప్రయాణికులు, బాటసారుల దాహార్తి తీర్చడం సంతోషకరమని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నూతన చలి వేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. చలి వేంద్రాలు ఏర్పాటు చేయడం హర్షణీయమని, దాహంతో ఉన్నవారికి తాగునీటి అందించాలనే గొప్ప మనస్సుతో దాతలు ముందుకు రావడం గర్వించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్, నాయకులు మైపాల్, శోభన్, సందీప్, రాజు తదితరులు ఉన్నారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

### తాగునీరు, మజ్జిగ పంపిణీ

కొడంగల్: జుంటుపల్లి శ్రీరాములవారి కల్యాణోత్సవం సందర్భంగా జాతరకు వెళ్లే దారిలో భక్తులకు గురువారం తాగునీరు, మజ్జిగ పంపిణీ చేశారు. తాండూరుకు చెందిన గౌస్‌బాబా ఆధ్వర్యంలో ఆయన శిష్యులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా చేశారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

- చదువుపై నిర్లక్ష్యం చేయకుండా.. పట్టు సాధించాలి
- మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల
- ఇష్టంగా చదివి.. ఉన్నతంగా ఎదగాలి
- విద్యార్థి జీవితంలో పాఠశాల విద్య కీలకం: కృష్ణస్వామి

అనంతగిరి: విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల అన్నారు. వికారాబాద్‌లోని వైష్ణవి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పరీక్షల సమయంలో చదువుపై పూర్తి దృష్టి సారించాలని చెప్పారు. టీవీ, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. పాఠశాల విద్య జీవితంలో రాణించడానికి దోహదపడుతుందని, నిర్లక్ష్యం చేయకుండా సబ్జెక్టులపై పూర్తి పట్టు సాధించాలన్నారు. విద్యార్థుల విషయంలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్తయ్య, కౌన్సిలర్ అనంతలక్ష్మి, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్‌కుమార్, పాఠశాల డైరెక్టర్లు వరప్రసాద్, నర్సింహులు గౌడ్, నర్సింహులు, సునీల్, సరిత, పద్మ, ప్రిన్సిపాల్ ఇబ్రహీం, విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



అనంతగిరి: జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

**భయం వీడాలి..**

కొడంగల్ రూరల్: విద్యార్థులు లక్ష్యం దిశగా చదువుతూ.. ఉన్నత స్థానాలకు ఎదగాలని మోటివేషన్ స్పీకర్ కృష్ణస్వామి, కౌన్సిలర్ శంకర్‌నాయక్ అన్నారు. గురువారం పట్టణంలోని నవీన ఆదర్శ ప్లే హైస్కూల్ విద్యార్థులు.. పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్షలంటే భయం వీడాలని, కష్టంతో కాకుండా ఇష్టంగా చదువుతూ మంచి మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. విద్యార్థుల జీవితంలో 10వ తరగతి పరీక్షలు ఎంతో కీలకమన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతాగానో అలరించాయి. కార్యక్రమంలో స్కూల్ ఫౌండర్ వెంకటయ్య, విశ్రాంత ఉపాధ్యాయులు రాములు, రాధాకృష్ణ, కరస్పాండెంట్ లక్ష్మీ, ప్రిన్స్‌పాల్ నరేష్ రాజ్, వైస్ ప్రిన్స్‌పాల్ సంతోష, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



కొడంగల్ రూరల్: వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణస్వామి

# రాళ్లు వేసి.. మట్టితో నింపి..

**ఎఫ్‌టీఎల్, శిఖం భూముల్లో యథేచ్ఛగా కబ్జాలు**

- రాత్రికి రాత్రే పెద్దపెద్ద రాళ్లు, మట్టితో నింపుతున్న వైనం
- మృత్యువాతపడుతున్న చేపలు.. పశుపక్ష్యాదులు
- ఆందోళనలో మత్స్యకారులు, ఆయకట్టు రైతులు
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు

ఇది కుంట్లూరులోని చారిత్రక పెద్ద చెరువు. సర్వే నంబర్ 185లో సుమారు 95.02 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించింది. ఇప్పటికే 43.08 ఎకరాలు అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లిపోయింది. ప్రస్తుతం 51.21 ఎకరాలే మిగిలింది. ఎల్బీనగర్ చౌరస్తాలో ఇప్పటికే మూసివేసిన సిరిస్ కంపెనీ ఆవరణలోని మట్టితో చెరువును నింపుతున్నారు. చేపలు మృత్యువాతపడి, మత్స్యకారుల ఉపాధి దెబ్బతింటోంది.





ఇది రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పెద్ద అంబర్‌పేట రెవెన్యూ పరిధిలోని ఈదుల చెరువు. సుమారు 80 ఎకరాల వరకు విస్తరించి ఉంది. ఇటీవల మునుగనూరు మల్లన్నగుట్ట కత్వ, అంబర్‌పేట మధ్యలోని ఎఫ్‌టీఎల్ భూమిలో స్థానికంగా ఉన్న ఓ ప్రజాప్రతినిధి మట్టినింపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

సాక్షి, రంగారెడ్డి జిల్లా: అక్రమార్కుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఖాళీ జాగా కనిపిస్తే చాలు దర్జాగా కబ్జా చేస్తున్నారు. చెరువులు, వాగులు, కుంటలు ఏదీ వదలడం లేదు. ప్రస్తుతం ఎండలు రోజురోజుకూ పెరుగుతుండడంతో భూగర్భ జలాలు పడిపోతున్నాయి. చెరువులు, కుంటల్లో నీరు ఇంకిపోయి ఎఫ్‌టీఎల్, శిఖం భూములు బయటపడుతున్నాయి. వీటిపై కన్నేసిన కొంతమంది రియల్టర్లు ఇదే అదనుగా రాత్రికి రాత్రే వరద కాల్వలు, ఎఫ్‌టీఎల్ పరిధిలోని శిఖం భూములను రాళ్లు, మట్టితో నింపి చదును చేస్తున్నారు. చెరువు ఆనవాళ్లు లేకుండా చేసి చెరబట్టేస్తున్నారు. జిల్లాలో 2,132 చెరువులు, కుంటలు ఉండగా, 10,946 ఎంఎఫ్‌టీ సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. వీటి పరిధిలో 70,067 ఎకరాల ఆయకట్టు ఉంది. వీటిలో ఏటా రూ.1.20 కోట్ల చేపపిల్లలను వదులుతుండగా, ఏటా 400 టన్నులకుపైగా చేపల దిగుబడి వస్తోంది. ప్రమాదకరమైన రసాయనాలు, మట్టితో వీటిని నింపుతుండటంతో చేపలు మృత్యువాతపడి, మత్స్యకారులకు ఉపాధి అవకాశం లేకుండా పోతోంది.

**చూసీచూడనట్లు అధికారుల తీరు..**

చెరువులకు ఎఫ్‌టీఎల్ నిర్ధారించి, ఆక్రమణలకు గురికాకుండా చూడాల్సిన ఇరిగేషన్ అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. అడ్డగోలుగా నిరభ్యంతర పత్రాలు జారీ చేస్తూ వెంచర్ల ఏర్పాటుకు సహకరిస్తున్నారు. స్థానిక రైతులు, మత్స్యకారులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే.. హడావుడి చేసి ఆ తర్వాత విస్మరిస్తున్నారు.

**మచ్చుకు కొన్ని..**

- తుర్కయంజాల్‌లోని చారిత్రక మాసబ్ చెరువు 499 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించింది. దీనిలో 320 ఎకరాల శిఖం భూమి ఉంది. సర్వే నంబర్ 205లోని సుమారు రూ.300 కోట్ల విలువ చేసే భూములపై రియల్టర్ల కన్ను పడింది. 12 ఎకరాలకు 2016లోనే ఎన్‌ఓసీ జారీ చేసినట్లు తెలిసింది. ప్రస్తుతం ఈ భూమిలో ఐదు నుంచి ఏడు ఫీట్ల లోతు నీరు నిల్వ ఉంది. రసాయన పరిశ్రమ నుంచి తవ్విన మట్టితో చెరువును పూడ్చుతుండటంతో చేపలు మృత్యువాతపడుతున్నాయి.
- జల్‌పల్లిలోని పెద్ద చెరువు (ఇబ్రహీంసాగర్) సుమారు 150 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. చెరువులో నీరు తగ్గుముఖం పట్టడంతో కబ్జాదారులు ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ఎఫ్‌టీఎల్ పరిధిలోని భూములపై కన్నేశారు. రాత్రికి రాత్రే పెద్దపెద్ద బండరాళ్లు తెచ్చి నింపేస్తున్నారు. అడ్డుకోవాల్సిన నీటిపారుదలశాఖ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు.
- నాదరగుల్ సమీపంలోని సున్నం చెరువు అలుగుకు రంధ్రాలు చేసి నీటిని బయటికి పంపిన రియల్టర్లు తాజాగా ఎఫ్‌టీఎల్ పరిధిలో రసాయనాలతో కూడిన మట్టిని నింపుతున్నారు. మట్టిలోని రసాయనాలు నీటిలో కలిసి చేపలు మృత్యువాత పడుతుండడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.
- కందుకూరు మండలం గూడూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 5లో పూచర్లకుంట ఎఫ్‌టీఎల్ సహా కట్ట, అలుగు, తూము ఉన్న ప్రాంతాలను రియల్టర్లు కబ్జా చేశారు. ఫాం లాండ్ పేరుతో వెంచర్ ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఇటీవల స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇప్పటికీ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

**ఆ మట్టి నిండా విష పదార్థాలే..**

ఎల్బీనగర్ చౌరస్తాలో పాత సిరీస్ కంపెనీ స్థలాన్ని ఓ ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ కొనుగోలు చేసింది. ఇటీవల ఈ ప్రాంగణంలో సెల్లార్ తవ్వకాలు ప్రారంభించింది. నిజానికి ఈ మట్టి ఎందుకూ పనికిరాదు. మట్టినిండా విషరసాయనాలే. జన సంచారం లేని ప్రాంతాల్లో ఈ మట్టిని పారబోయాలి. కానీ సదరు రియల్టర్ సహా సెల్లార్ కాంట్రాక్ట్ దక్కించున్న వ్యక్తులు ఈ మట్టితో సొమ్ము చేసుకునే పనిలో పడ్డారు. ఇక్కడ మైనింగ్‌కు అనుమతి తీసుకున్నారు. మట్టిని లారీలో ఎత్తి ఇతర ప్రాంతాలకు తరలిస్తే రాయల్టీ చెల్లించాల్సి ఉంటుంది. సెల్లార్ కాంట్రాక్టర్ ఇవేవీ పట్టించుకోకుండా రాత్రికిరాత్రే గుట్టుగా కుంట్లూరు సమీపంలోని పెద్ద చెరువు, పెద్ద అంబర్‌పేట సమీపంలోని ఈదులకుంట, నాదర్‌గుల్ సమీపంలోని సున్నం చెరువులకు తరలించి ఎఫ్‌టీఎల్ భూముల్లో నింపేస్తున్నారు. ఈ మట్టి నిండా ప్రమాదకర విషపదార్థాలు నిల్వ ఉండటంతో అవి చెరువుల్లోకి చేరి జీవరాశుల మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. మైనింగ్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు విషయం తెలిసీ కిమ్మనకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**జిల్లాలో వంద ఎకరాలలోపు, పైగా ఉన్న చెరువులు, కుంటలు**

| చెరువు | డివిజన్-1 | డివిజన్-2 | చేవెళ్ల | షాద్‌నగర్ | కల్వకుర్తి |
|---|---|---|---|---|---|
| 100కుపైగా | 60 | 376 | 203 | 28 | 18 |
| 100 లోపు | 732 | - | - | 432 | 280 |
| సామర్థ్యం | 6,046.28 | 1,104 | 913 | 1,322.22 | 1,560.9 |
| ఆయకట్టు | 31,936.28 | 7,850 | 6,845 | 13,265.23 | 10,170.28 |